క్లుప్తంగా

ఉపాధి కూలీలకు న్యాయం చేయండి

ఆత్మకూరు(చేజర్ల): తాము ఉపాధి పనులకు వచ్చినా మరుసటి రోజు తమ పేర్లను మస్టర్లలో తొలగించారని, తమకు న్యాయం చేయాలని బాధిత కూలీలు వేడుకుంటున్నారు. ఈ మేరకు మంగళవారం చేజర్లలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వివరాలు.. చేజర్ల మండలంలోని బోడిపాడు గ్రామానికి చెందిన సుమారు 50 మంది శని, సోమ వారాల్లో ఉపాధి పనులకు వెళ్లారు. టెక్నికల్ అసిస్టెంట్ పనులు జరుగుతున్న వద్దే మస్టర్లు వేసుకున్నారు. సంతకాలు తీసుకున్నారు. చేస్తున్న పనులను ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. అయితే సాయంత్రం మస్టర్లు పరిశీలించగా 10 మందికి పైగా పేర్లను డిలీట్ చేసి ఉన్నారని, ఇది ఎలా సాధ్యమని వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతూ ఏపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఏపీఓ వెంకటేశ్వర్లును సంప్రదించగా, కొందరు పేర్లు సాంకేతిక కారణాలతో డిలీట్ అయ్యాయని, వారికి చేసిన పనికి పూర్తిగా నగదు చెల్లించడం జరుగుతుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

పరిశుభ్రమైన తాగునీరు అందిస్తాం



తాగునీరు శుద్ధి చేసే ప్లాంటును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. మున్సిపల్ పరిధిలోని బట్టేపాడు మార్గంలో ఏర్పాటు చేసి ఉన్న నీటిశుద్ధి ప్రయోగశాలను ఆయన చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, పలువురు కౌన్సిలర్లతో కలిసి మంగళవారం పరిశీలించారు. సోమశిల జలాశయం నుంచి పైపులైన్ ద్వారా నీరు సరఫరా అయి పట్టణంలోని శుద్ధినీటి కేంద్రం వద్ద నీటిని శుభ్రపరిచి ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వరలక్ష్మి, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు గంధళ్ల వేణు, సూరా భాస్కర్‌రెడ్డి, గౌస్‌బాషా, పిడికిటి వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, వెంకటయ్య, చిన్నపరెడ్డి, బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీహెచ్‌ఈఎల్‌కు నూతన బస్ సర్వీసు



ఉదయగిరి: ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి నూతనంగా గురువారం నుంచి హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్ మీదుగా బీహెచ్‌ఈఎల్‌కు అత్యాధునిక సాంకేతికత, సౌకర్యాలు కలిగిన నూతన సూపర్ లగ్జరీ సర్వీసును నడుపుతున్నట్లు మంగళవారం డీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు సర్వీసును ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సర్వీసు ప్రతి రోజూ ఉదయగిరి నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతుందని, ప్రయాణికులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

లెప్రసీ సర్వేపై శిక్షణ

ఉదయగిరి: పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలో గండిపాళెం పీహెచ్‌సీ ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు, సిబ్బందికి లెప్రసీ సర్వేపై మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి వినీత మాట్లాడుతూ ఉదయగిరి మండలంలో ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే బృందం ఇంటింటికీ తిరిగి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రసీ అనే బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుందని తెలిపారు. సర్వే నివేదికను ఏఎన్‌ఎంలు ప్రతిరోజు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, సీహెచ్‌ఓ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు నుంచి అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

ఆత్మకూరురూరల్: గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ ధర రానుపోను ఒకరికి రూ.1,400గా నిర్ణయించామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా రిజర్వేషన్ చేసుకొనే వెసులుబాటు ఉందని తెలిపారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్ సందర్శించి అరుణాచలం గిరి ప్రదక్షిణ, దర్శనం చేసుకునేలా ఈ సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు డిపో మేనేజర్ మొబైల్ నంబర్ 99592 25645, సీఐ మొబైల్ నంబర్ 99660 09395, బస్సు కండక్టర్ సుబ్బయ్య మొబైల్ నంబరు 85559 29504లలో సంప్రదించవచ్చని తెలిపారు.

మౌలాలి సేరా గ్రామోత్సవం

అల్లూరు: మొహర్రం సందర్భంగా మంగళవారం స్థానిక మౌలాలి దర్గా వద్ద మౌలాలి సేరాను ప్రత్యేక పూల అలంకరించి గుర్రంపై అల్లూరులో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

కంపు బాబోయ్

పల్లెలు, పట్టణాలు మురుగుమయంగా మారి కంపు కొడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పారిశుద్ధ్యం నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు ముందుకు కదలని పరిస్థితి ఉంది. రోడ్లపై చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. చిరుజల్లులు కురిసినా మురుగునీరు రోడ్లపై నిలిచి అడుగు వేయలేని పరిస్థితి ఉంది. అయినా ప్రజల ఇబ్బందులు అధికారులకు, పాలకులకు పట్టడం లేదు.

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- పూడిపోయిన మురుగు కాలువలు
- చిరుజల్లులకే వీధులు రొచ్చురొచ్చు
- పారిశుద్ధ్యంపై కరడుగట్టిన నిర్లక్ష్యం
- దోమల వ్యాప్తితో వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- చర్యలు తీసుకోని అధికారులు, పాలకులు

కావలి: పారిశుద్ధ్యం నిర్వహణ, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయడంపై నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వెరసి కావలి ప్రజలకు శాపంగా మారింది. ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కావలిలో పారిశుద్ధ్యం మెరుగుపై అధికారులు, పాలకులు పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కావలి పట్టణంలో సుమారు 220 కిలోమీటర్ల దూరం మురుగు కాలువలు ఉన్నాయి. వీటిలో కనీసం 150 కిలోమీటర్ల కాలువల్లో మురుగు పారుదల సక్రమంగా లేదు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. చినుకుపడితే చాలు వర్షపు నీరంతా రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంలో జాగ్రత్తలు పాటించకపోవడం, పట్టణంలోని నివాసాల నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్లేలా నిర్మాణాలు జరగకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. అలాగే కావలి పట్టణంలో రోజుకు 55 టన్నుల చెత్త నివాసాల నుంచి వాణిజ్య సంస్థల నుంచి వస్తున్నప్పటికీ అది మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్‌కు చేరడం లేదు. వీధుల్లో, రోడ్ల వెంబడి చెత్తాచెదారం పేరుకుపోయి కుళ్లి దుర్గంధం వెదజల్లుతూ దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాయి. అలాగే అల్లూరులో కూడా మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు అవస్థలు పడుతున్నారు.



కావలి: జనతాపేటలోని మురుగు కాలువలో ముందుకు కదలని మురుగునీరు

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

ఉదయగిరి: నియోజకవర్గ కేంద్రం ఉదయగిరితో పాటు మండల కేంద్రాలు, పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. రోడ్లపై చెత్తాచెదారం, కాలువల్లో మురుగు పేరుకుపోయింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మురుగు వల్ల దోమలు వృద్ధి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 143 గ్రామ పంచాయతీల్లో ఎక్కువ చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొద్దిపాటి వర్షాలకే పల్లెల్లో అంతర్గత రోడ్లపై మురుగునీరు చేరుతోంది. వర్షపునీరు బయటకెళ్లేందుకు మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో రోజులు తరబడి మురుగునీరు రోడ్లపై నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రాల్లో అదే తీరు

నియోజకవర్గ కేంద్రం ఉదయగిరి, మండల కేంద్రమైన వింజమూరులో జనాభా ఎక్కువ. ఇక్కడ మురుగు కాలువలు సక్రమంగా లేవు. కొన్నిచోట్ల డ్రైనేజీ కాలువలు ఉన్నా వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర సామగ్రి చేరి మురుగునీరు ముందుకు కదలడం లేదు. ఉదయగిరి యూనియన్ రోడ్డు, నాగులబావి వీధి, ఇందిరానగర్, ఎస్సీకాలనీ తదితర ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వింజమూరులో కూడా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు ఇళ్ల మధ్యే నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీ కాలువల్లోనే మురుగునీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఎన్‌టీకేఆర్ ఎస్టీకాలనీ, బీసీకాలనీ, పాతూరు, నడిమూరు, హిందూనగర్, నేతాజీ కాలేజీ రోడ్డు, గంగమిట్ట, దేవతామహల్ సెంటర్ తదితర చోట్ల మురుగు కాలువలు సక్రమంగా లేక ఎక్కడి మురుగు అక్కడే పోరుకుపోతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మురుగుమయం

ఆత్మకూరు: సుమారు 35 వేలకు పైగా జనాభా ఉన్న ఆత్మకూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరును సుందరంగా తీర్చిదిద్దుతామని అధికారులు ప్రకటిస్తున్నా ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. ఆత్మకూరు మున్సిపాలిటీ మురుగుమయంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో మురుగునీరు ప్రవహించేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నీరు దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఆత్మకూరు 5వ వార్డులోని జేఆర్‌పేట శివారు, 7వ వార్డు పరిధిలోని రైస్ మిల్లు ప్రాంతం, 9వ వార్డు పరిధిలోని అనంతరాయనియేని, 17వ వార్డు పరిధిలోని టెక్కే, 19వ వార్డు పరిధిలోని ఏసీఎస్‌ఆర్‌కాలనీ, సచివాలయం ప్రాంతాల్లో మురుగు ముందుకు సాగక దుర్గంధం వెదజల్లుతోంది.

పంట కాలువల్లోకి మురుగునీరు

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పులిమి కొండమ్మ బావి సెంటర్, 19వ వార్డు సచివాలయం ప్రాంతం, చెరువు సమీప ప్రాంతాల్లో ఇళ్లలోని మురుగునీరు నేరుగా సాగునీరు ప్రవహించే పంట కాలువల్లోకి వెళ్లేలా చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు నీటి కన్నా అధికంగా పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి పంట కాలువల్లో కలిసే మురుగునీరే పైర్లకు ప్రవహిస్తుందంటే పరిస్థితి అర్థమవుతోంది. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.

బిల్లుల్లోనే బ్లీచింగ్, దోమలు నివారణ మందులు

మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మురుగు, చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లి, దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి గమనిస్తే అలాంటిది ఎక్కడా కనిపించదు. బ్లీచింగ్, దోమల నివారణ మందులు కొనుగోలు చేసినట్లు బిల్లుల్లో మాత్రమే కనిపిస్తుంది తప్ప వాస్తవానికి వాటిని ఉపయోగించిన దాఖలాలు లేవని ప్రజలు మండిపడుతున్నారు.

నడిబొడ్డున ఇదే పరిస్థితి

ఆత్మకూరు మున్సిపల్ శివారు ప్రాంతాల పరిస్థితి ఇలా ఉండగా, పట్టణ నడిబొడ్డులోని సోమశిల రోడ్డు సెంటర్, జేఆర్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, చింతచెట్లకాలనీ, ఎల్‌ఐసీ కార్యాలయం వెనుక వైపు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఎప్పటికప్పుడు మురుగు తొలగించి శాశ్వతంగా డ్రైనేజి వ్యవస్థను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పలు ప్రాంతాల్లో మురుగు పేరుకుపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డ్రైనేజీ వ్యవస్థ లేక అవస్థలు

కలిగిరి: మండలంలోని పలు పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగునీరు రోడ్లపై నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల డ్రైనేజీ కాలువలు ఉన్నా పూడికతీత పనులు చేపట్టడం లేదు. గ్రామాల్లో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కలిగిరి: గంగిరెడ్డిపాళెంలో డ్రైనేజీ కాలువలో నిలిచి ఉన్న మురుగునీరు



ఉదయగిరి: యూనియన్‌రోడ్డులో మురుగు కాలువ దుస్థితి



ఉదయగిరి: గండిపాళెం రోడ్డులో డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



వింజమూరులోని హిందూనగర్‌లో..



కావలి: అల్లూరులోని కలుగోళమ్మ వీధిలో తొలగించని చెత్త



ఆత్మకూరు: సోమశిల రోడ్డు సెంటర్ వద్ద మురుగు కాలువలో చెత్త, వ్యర్థాలు



ఆత్మకూరు: రవితేజ కల్యాణ మండపం సమీపంలో కాలువ దుస్థితి



ఆత్మకూరు: టెక్కేవీధిలో మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

అనపగుంట.. ప్రజలకు తంటా



ఈ ప్రాంతం కావలి పట్టణంలోని అనపగుంట. కావలి పట్టణంలోని జనతాపేట, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లో ఉన్న నివాసాల నుంచి ముగురునీరు వచ్చి ఈ అనపగుంటకు చేరుతోంది. ఈ మురుగు ఇక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. తద్వారా దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చిన్నపాటి జల్లులు కురిసినా ఈ అనపగుంటలోని మురుగునీరు చుట్టుపక్కల ఉన్న ఇళ్లల్లోకి చేరుతోంది. దోమల ఫ్యాక్టరీగా ఉన్న ఈ అనపగుంటలో మురుగునీరు చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలి



గంగిరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలి. పలుచోట్ల డ్రైనేజీ కాలువలు లేవు. డ్రైనేజీ కాలువలు ఉన్న చోట కూడా మురుగునీరు గ్రామం బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలి.

– అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, గంగిరెడ్డిపాళెం, కలిగిరి మండలం

దోమలు పెరిగిపోయాయి



కావలిలో మురుగు కాలువలు సక్రమంగా లేక ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దోమలు బాగా పెరిగిపోయాయి. వర్షం కురిస్తే చాలు మురుగు నీరంతా వీధుల్లో వచ్చి నానా అవస్థలు పడుతున్నాం. వర్షాకాలంలోనైనా మురుగునీరు, చెత్తాచెదారం ఇళ్ల మధ్య నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– షబ్బీర్, కావలి

కాలువలు శుభ్రం చేయాలి



ఉదయగిరిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. చిరుజల్లులు కురిసినా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ప్రతి రోజూ కాలువలు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం కాలువల్లో పేరుకుపోతోంది. పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలి. సాయంత్రం సమయంలో దోమల మందు ఫాగింగ్ చేస్తే దోమల బెడద తగ్గుతుంది.

– ఆవుల రోశయ్య, ఉదయగిరి

దోమలతో అల్లాడుతున్నాం



టెక్కే పరిధిలో కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి రోగాల బారిన పడుతున్నాం. మున్సిపల్ సిబ్బంది అప్పుడప్పుడూ కాలువల్లో మురుగు తొలగిస్తున్నా పరిస్థితి అలాగే ఉంది. పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– సయ్యద్ గయాజ్‌బాషా, ఆత్మకూరు

మురుగునీటితో ఇక్కట్లే



ఆత్మకూరు పట్టణంలోని పలు కాలువల్లో మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీ కాలువల్లో మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణ మందులు స్ప్రే చేయకపోవడంతో పట్టణం మురుగుమయంగా ఉంది. ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు ఉధృతమయ్యాయి. ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించేలా, కాలువల్లో మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జి.నాగరాజారెడ్డి, బ్రాహ్మణవీధి, ఆత్మకూరు

మా ఇళ్ల ముందు కాలువలే లేవు



మా ఇళ్ల ముందు సైడ్‌కాలువలు కొన్ని చోట్ల పూడిపోయి మురుగునీరు వెళ్లని పరిస్థితి ఉంది. పూర్తిస్థాయిలో మురుగు కాలువల నిర్మాణం జరగకపోవడంతో మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఓ వైపు దోమలు, మరోవైపు దుర్గంధంతో అవస్థలు పడుతున్నాం.

– షేక్ అహమ్మద్‌బాషా, ఓల్డ్ డీఎస్పీ బంగ్లా వీధి, ఆత్మకూరు

బ్యారేజ్‌ను పరిశీలించిన అధికారులు



సంగం: స్థానిక ఎంజీఆర్ సంగం బ్యారేజ్‌ను మంగళవారం తహసీల్దార్ రమాదేవి, ఎస్సై నాగార్జునరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు బారాషాహిద్ దర్గా వద్ద రొట్టెల పండగకు వచ్చే భక్తులు, యాత్రికులు సంగం బ్యారేజ్‌ను సందర్శిస్తారని, ఈ నేపథ్యంలో యాత్రికుల కోసం బ్యారేజ్ వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై సిబ్బందితో చర్చించినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఐదు రోజులపాటు బ్యారేజ్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏడీఏ దేవసేనమ్మ

అనుమసముద్రంపేట: కౌలు రైతులు ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటే బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏడీఏ దేవసేనమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీకొలను గ్రామంలో కౌలు రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు వీఆర్‌ఓల ద్వారా సీసీఆర్ కార్డులు పొందితే సబ్సిడీపై విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ రజని, వీఏఏ తులసి, వీఆర్‌ఓ రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

పోలేరమ్మకు పాల పొంగళ్లు



పోలేరమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని కొట్టాలు గ్రామంలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తులు పాల పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఏటా ఆషాడ మాసంలో పౌర్ణమి ముందు మంగళవారం పోలేరమ్మకు పొంగళ్లు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. అమ్మవారి ఆలయంలో పొంగళ్లు పెట్టేందుకు అవసరమైన సామగ్రిని వెదురుబుట్టలలో పెట్టుకొని ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయానికి చేరుకున్నారు. పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు గణాచారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టండి

అనుమసముద్రంపేట: నెల్లూరు బారాషాహిద్ దర్గాలో జరగనున్న రొట్టెల పండగ సందర్భంగా ఏఎస్‌పేట దర్గాకు భక్తులు వచ్చే అవకాశముందని, వీరి కోసం దర్గా ప్రాంగణంలో స్వచ్ఛమైన తాగునీటిని ఏర్పాటు చేయాలని ఏఎస్‌పేట తహసీల్దార్ రవికుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం మొహర్రం సందర్భంగా ఏఎస్‌పేటలోని దర్గా ప్రాంగణాన్ని ఎంపీడీఓ రవికుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఎక్కడెక్కడ తాగునీటిని ఏర్పాటు చేశారని దర్గా ఈఓ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. మూడు చోట్ల భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగ

ఉదయగిరి: పట్టణంలోని నాగులబావి వీధికూడలిలో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే సమయంలో పీర్లపండగ జరుగుతుండడంతో అక్కడున్న యువకులు తెగిపడిన విద్యుత్ తీగను గమనించి ఆ వీధిలో ఎవరూ నడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ట్రాన్స్‌కో అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి లైను పునరుద్ధరించి విద్యుత్ సరఫరా చేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

సోమశిల: అనంతసాగరంలోని ఎస్టీకాలనీకి చెందిన ఈగ శేషమ్మ (26) సోమవారం విషగుళికలు తిని తీవ్ర అస్వస్థతకు గురైంది. అనంతరం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు శేషమ్మ విషగుళికలు తిని తీవ్ర అస్వస్థతకు గురి కాగా.. చికిత్సనిమిత్తం నెల్లూరులోని జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆమె సోమవారం సాయంత్రం మృతిచెందింది. ఈ ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేసినట్లు ఏఎస్సై మస్తాన్ తెలిపారు.

డెంగీ నివారణపై అవగాహన

కావలి: పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆదేశాల మేరకు మంగళవారం డెంగీ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కళాశాల కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ వి.వసుంధరదేవి మాట్లాడుతూ డెంగీ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.





